బ్రీూవగాడి చేతిలోని ధనంలా వచ్చిన సాయంకాలపు నీరెండ సన్నగా చల్లగా జారిపోతూండగా, ఆస్తి అంతా మంగళహారతి అయిపోయాక ఆటగాడి మనస్సులో వ్యాపించే శూన్యంలాగ చుట్టూ చిక్కని చీకట్లు పరుచుకుంటున్నాయో, 'ఇంకోమాటు లాటరీ వేస్తే అదృష్టం తగలకపోతుందా' అనే వ్యసనపరుడి ఆశా ప్రమాణాల్లా అక్కడోటీ అక్కడోటీ తారకలే తళుక్కుమంటూ వికసిస్తున్నాయో — ఇవన్నీ ఎక్కడ చూశాడు రవణయ్య?

అతని దృష్టి ఎంతసేపటికీ అదిగో, అక్కడికి పది బారల దూరంలో రోడ్డు పక్క ఎలక్ట్రిక్ దీపం కింద, సీనారేకు డబ్బా ఓటి ముందు పెట్టుకుని అరుస్తూన్న ముష్టివాడు లేడూ, వాడిమీద కేంద్రీకృతం అయి ఉంది.

వాడికి ఉన్నవి చింకిరి గుడ్డలూ, మాసి మాగిళ్ళు కట్టిన జుట్టూ, అరవై డెబ్బై యేళ్ల వడిలిపోయిన శరీరమూ, ఆ శరీరానికి వేళ్లాడుతూన్న రెండు వదులు చింకిపాతలూను. ఆ చింకిరి గుడ్డలలో ఊగిసలాడుతూన్న అస్థిపంజరాన్ని రోజూ సాయంత్రం వేళ అక్కడికి జేరేస్తాడు ఆ ముష్టివాడు. అది పార్కుని అనుకొని ఉన్న సినిమాలకి వెళ్లే రోడ్డేమో, సాయంత్రం అయిదూ అయిదున్నర అయ్యేటప్పటికల్లా ఇటు పార్కుకి వచ్చే జనంతోను, అటు సినిమాకి పోయే జనంతోను మాంచి రద్దీగా ఉంటుంది. పార్కు రద్దీ తొమ్మిదింటికి తగ్గినా, రెండో ఆట అయిపోయాక గాని సినిమా జనం హడావిడి తగదు. అందుకే ఆ ముష్టివాడు సాయంత్రం ఆరింటికి వచ్చినవాడల్లా, రాత్రి ఒంటిగంట అయ్యేదాకా అక్కడ కూర్చుని అరుస్తూ ఉంటాడు, "గుడ్డోణ్ణి, బాబయ్యా! దరమం సెయ్యండి" అంటూ

అంతక్రితం ఏమోకాని, పెంపుడు తండ్రి గతించి పెత్తనం చేతికి వచ్చి, జల్సాగా తిరగడం మొదలు పెట్టిన ఈ రెండేళ్లనుంచి మాత్రం రోజూ రవణయ్య ఆ ముష్టివాడిని అక్కడ చూస్తూనే ఉన్నాడు. వాడి టైమూ తన టైమూ సరిగ్గా ఒక్కటే. తను పార్కుకి వచ్చి ఆ మూల సిమెంటు బెంచిమీద శరీరాన్నంతా వెల్లకిలా పరిచి, పొడవు సరిపోక తలని మెడని కిందకి తల్లక్రిందులుగా వేళ్లాడవేసి పార్కులైటు వెలుతురులో బ్రాకెట్ అంకెల కాగితపు రీలు పరీక్షగా చూస్తూ కూర్చొనే వేళా, ఆ ముష్టివాడు రోడ్డు పక్కన ఉన్న తన మామూలు స్థలానికి కర్రతో తడుముకుంటూ వచ్చి కూర్చుని "గుడ్డోణ్ణి, బాబయ్యా! దరమం సెయ్యండి!" అంటూ అరవడం ప్రారంభించే వేళా కలుస్తాయి.

ఆ బ్రాకెట్ కాగితపుచుట్ట ఆధారంగా, ఆ రాత్రి వచ్చే బ్రాకెట్ ఓపెనింగూ, క్లోజింగూ ఏదో నిర్ణయించుకొని ఏ ఏడున్నరా ఎనిమిదింటికో రవణయ్య అక్కడనుంచి లేచేదాకా, పార్కులోని రకరకాల ధ్వనులతో కలిసి దూరాన్నించి ఉండి ఉండి ఆ ముష్టివాడి కేక వినిపిస్తూనే ఉంటుంది రోజూను. కిళ్లీబడ్డీ దగ్గిరికి పోయి బ్రాకెట్ కట్టి, రిజల్ట్ వచ్చేలోగా కాలక్షేపంకోసం ఏ ఇంటర్వెల్ నుంచి ఇంటర్వెల్‌దాకా ఏదో సినిమా చూసి, ఆ తరవాత బ్రాకెట్ ఫలితం తెలుసుకుని ఉసూరుమంటూ తిరిగి ఈ రోడ్డునే కాళ్లీడ్చుకుంటూ వచ్చేటప్పుడు అర్ధరాత్రి వేళ చిరాగ్గా



పిచ్చుకాతాత కూడా ఆడుకుంటూ ఉంటే, ఆ తాత కంట పడకుండా దాగుడుమూత లాడుతూ తిరుగుతూ, గడ్డిలో కూర్చున్న పెద్ద మనుష్యులకి వేరుసెనక్కాయల్నీ, పోడుల్నీ అమ్ముతున్నారు ఇద్దరు కుర్రాళ్ళు. ఇలా వార్తలూ, కేరింతాలూ, కేకలూ, అరుపులతో కోలాహలంగా ఉన్న పార్కు వాతావరణంలోకి ఉండి ఉండి చిల్లుకువస్తూంది దూరాన్నించి "గుడ్డోడిని, బాబయ్యా, దరమం సెయ్యండి" అంటూ అరుస్తూన్న ముష్టివాడి కేక.

చుట్టూ జరుగుతూన్న ఈ హడావిడినేం పట్టించు కోకుండా, ఇప్పటిదాకా ఈ గంటసేపూ ఆ బ్రాకెట్ గళ్ళ కాగితపు రీలులోకే ఏకాగ్ర దృష్టితో చూస్తూ రవణయ్య ఆనందమయ లోకాల్లో విహరించాడు. విహరించడు మరీ. కార్టూన్ చేసిన కామెంట్‌ని రీలు మళ్ళీ మళ్ళీ వాస్తవం చేసి చూపుతూంది.

ఇవాళ బుధవారం. జూలై మూడో తారీకు. గడిచిన నాలుగు బుధవారాల నుంచీ ఓపెనింగ్ ఒక్కొక్కటి తప్పున హెచ్చి, పోయిన బుధవారానికి తొమ్మిదికి వచ్చింది. అందువల్ల ఇవాళ ఓపెనింగ్ తొమ్మిది తరవాత అంకె—జీరో అయి తీరాలి. పైగా, పోయిన సంవత్సరం జూలై మూడో తారీఖు ఓపెనింగ్ కూడా జీరోయే!

అందువల్ల, ఇవాళ ఓపెనింగ్ జీరోయే ఖాయం.

ఇక క్లోజింగ్. ఈమధ్య పదిరోజుల నుంచి రోజు విడిచి రోజు జీరో వస్తూంది క్లోజింగ్. మొన్న జీరో. ఇవాళ జీరోయే రావాలి. తారీఖుల లెఖ్ఖల ప్రకారం చూసినా ఈమధ్య బేసినెలల మూడో తారీఖుల నాటి క్లోజింగ్‌లన్నీ అయిదో, జీరోయో అవుతున్నాయి. మే నెల మూడో తారీఖు క్లోజింగ్ అయిదు కనుక, ఈ మూడో తారీఖు క్లోజింగ్ జీరో అయి తీరాలి!

ఏతావతా ఇవాల్టి ఓపెనింగూ క్లోజింగూ కూడా జీరోయే అని ఢంకా బజాయించి చెబుతూంది కాగితపు రీలు. పొద్దుటి కార్టూన్ కూడా అదే చెప్పిందికదా? రవణయ్య పట్టలేని ఉత్సాహంతో ఒక్క ఉదుటున సిమెంటు బెంచీ మీదనించి లేచాడు. మళ్ళీ మళ్ళీ ఆ మసక వెలుతురులో పార్కులోని జనాన్ని పరిశీలించి చూశాడు. అధమం రూపాయి అయినా అప్పిచ్చే మొహం ఒక్కటి కూడా కనిపించలేదు అంతమందిలోనూ అతనికి. దాంతో నిరుత్సాహంగా, చిరాగ్గా వచ్చి ఇలా పార్కు గేటులో నిలబడి, ఆ ముష్టివాడిని చూస్తూ వాడితో తనని పోల్చుకుంటూ అమట్టుని ఉండి పోయాడు ఇందాకటినించీను.

రూపాయి కాకపోతే అర్ధరూపాయి . . . పావలా... కనీసం పైసలు. . . తన కిప్పుడు ఎంతో అంత . . . డబ్బు కావాలి . . . ఏవిటి చెయ్యడం? . . . ఎక్కడ దొరుకుతుంది డబ్బు? . . . ఏదీ? . . . ఎవరి జేబులో ఉంది? . . . ఎలా సంపాదించడం . . . బుర్రంతా గందరగోళంగా ఉంది. . . ఒక్క క్షణం ఆలస్యాన్ని కూడా భరించలేక తెగ కంగారు పడిపోతున్నాడు . . . ఆలోచనేం సాగడం లేదు. . . డబ్బు. . . డబ్బు కావాలి ... ఎలాగ? . . . అవతల బ్రాకెట్ టైము దాటిపోతూంది . . .

ఓ మూల తను ఇలా తెగ కంగారుపడుతూ ఆలోచన లతో సతమత మవుతూంటే, ఏమీ తోచనియ్యకుండా ఈ ముష్టివాడి గోల ఒకటి! వెధవ అరుపూ వీడూను! వీడికీ డబ్బు దండగే! గుండ్రంగా బిళ్ళలా నున్నగా ఉన్న ఈ రాయేసి కొడితే, ఒక్క దెబ్బతో ఠామ్మని చస్తాడు ముసలిపీను . . . చచ్చుగోలా వీడూను!

అయినా చచ్చు ముష్టి ఎన్నాళ్ళు ఎత్తుతాడు? ఎన్నేళ్ళు ఎత్తితే తీరేను వీడి దరిద్రం! ఏ లాటరీయో వేసుకుంటే పోలే! హాయిగా చచ్చేదాకా కాలుమీద కాలు వేసుకుని కూచుని తినచ్చునే! అసలు ప్రతివాడూ రోజూ తనకి వచ్చే డబ్బులో అంతో ఇంతో అదృష్టం మీద కాయాలి. ఈతగింజ వేస్తే, వస్తుందా కొండని ఈడ్చుకువస్తుంది; పోతుందా ఈతగింజేగా? పోనీ! అలా ఉండాలి నన్నడిగితే ప్రతివాడి మనస్తత్వ మూను. అసలు ఇంతకీ ఈ ముసిలాడు ఎప్పుడేనా బ్రాకెట్ కట్టాడా అని! ఆఁ! వాడి మొహం! ... వాడి బ్రతుక్కి బ్రాకెట్టా. హూఁ! ఏదో నాలుగు డబ్బులు ముష్టి అడుక్కుని . . .

డ. . . బ్బు . . . లు . . . ఆఁ! . . . అవును.

రవణయ్య కాళ్ళు నెమ్మదిగా వీథి లైటు కింద కూర్చున్న ఆ ముష్టివాడి వేపు కదిలాయి.

డబ్బాలో నాణేలమీద లైటు వెలుగు జిగేల్ మంది. రవణయ్య కళ్ళు ఆబగా, తీపి పదార్థం మీదికి ఉరికే ఈగల్లా వాటిమీదికి దూకాయి. రవణయ్య తృప్తిగా ఓ గుటక వేసి, డబ్బా మీదికి వంగుతూ ఇటూ అటూ భయం భయంగా పరకాయించాడు.

ఎవ్వరూ చూట్టంలేదు!

ముష్టివాడికి చూపే లేదు! డబుల్ జీరోలా కళ్ళుండే స్థానంలో రెండు శూన్యమైన సున్నాలు. ఎదురుగుండా డబ్బాలో బ్రాకెట్‌కి కట్టడానికి ఉపయోగపడే డబ్బు!

రవణయ్య గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి.

ఒళ్ళంతా చెమట్లు!

చేతులు వణకసాగాయి.

మనస్సు తొందరచేస్తూంది.

మళ్ళీ అంతలోనే సందిగ్ధంలో పడుతున్నాడు.

"ముష్టివాడికి ఓ పైసా వేసేది అట్టే పోయి వాడి డబ్బు కాజెయ్యడమా?"

"ఆఁ . . . ఆ మాటకొస్తే వీడికి నే నెన్నిమార్లు పావలాలూ పడేసి పైసలూ ఇవ్వలేదూ?"

"ఇస్తే . . . ?"

"ఇచ్చాం కనక తీసుకోవచ్చు. అంతగా అయితే అప్పుగా తీసుకుంటాం. ఆ తర్వాత వడ్డీతో సహా తీర్చేస్తాం గంటలో."

"ముష్టివాడి దగ్గిర అప్పా? ... దానికి వడ్డీయా?"

"వడ్డీకాకపోతే వచ్చిందాంట్లో సహం పడేస్తాం. సరా?"


"ఆహా! అలాగా? . . . అలా చెప్పి అడిగి చూడు. ఇస్తాడేమో?"

"అడగడం ఎందుకు? రూపాయని చెప్పి ఈ గుండ్రాయి వాడి డబ్బాలో పడేసి చిల్లరి చెక్కేస్తే సరిపోలే?"

"అన్యాయం!"

"అన్యాయం ఏవిటోయ్! అరవై రూపాయలు వచ్చి పడుతూంటే . . . ఆ తరవాత వాడి అర్ధవాటా వాడికి పడేస్తాంగా?' అయినా, నువ్వేమిటి మధ్యన "నోరు మూసుకుని పడి ఉండక" అంటూ రవణయ్య అంత రాత్మ నోరు నొక్కి, గొల్లుమన్న బీదవాడి డబ్బా గోల వినిపించుకోకుండా, గుప్పిట్లో చిల్లరతో బ్రాకెట్ కట్టే కిళ్ళీ బడ్డీల వేపు ఒక్క దౌడు తీశాడు.

దౌడు తీసినప్పటి చురుకు, తిరిగి రాత్రి పన్నెండు న్నరకి ఉసూరుమంటూ కాళ్ళీడ్చుకుంటూ వచ్చేటప్పుడు లేదు రవణయ్యకి. అసలు చైతన్యమే ఉండకపోను, రోడ్డుకి అడ్డంగా విరిగి పడి ఉన్న ముషి వాడి చేతికర్ర కాళ్ళకి తగలకపోతే. ఉలిక్కిపడి అటు చూశాడు. గుండ్రంగా పడుతూన్న లైటు వెలుగులో ముష్టి



# ప్రపంచం పోకడ

## మీర్జా గాలిబ్

1842లో భారత ప్రభుత్వ కార్యదర్శి అయిన జేమ్స్ థామ్సన్ ఒకసారి ఢిల్లీ వచ్చాడు. ఢిల్లీ కళాశాలలో పర్షియన్ భాషా బోధనకు సరైన ఏర్పాట్లు జరగలేదని ఆయన గ్రహించాడు. సమర్థుడైన పర్షియన్ కవిపండితుని ఢిల్లీ కళాశాలలో ప్రధాన పర్షియన్ ఆచార్యుడుగా నియమించాలని నిర్ణయించుకున్నాడు. అప్పటికే, ఢిల్లీలో ఉంటున్న మీర్జా గాలిబ్‌పై ఆయన దృష్టి పడ్డది. కబురు పంపాడు.

గాలిబ్ గీతాలకు అప్పటికే దేశంలో ఎనలేని ఆదరణ, ప్రచారం ఉన్నది. కానీ ఆయన కడు పేదవాడుగానే జీవిస్తున్నాడు. గాలిబ్‌కు పర్షియన్ ప్రొఫెసర్ పదవి రానున్నదని తెలిసిన మిత్రులు, బంధువులు సంతోషించారు.

పిలుపు అందుకున్న గాలిబ్ తన పల్లకిలో థామ్సన్ బంగళాకు వచ్చాడు. థామ్సన్ ఎదురు వచ్చి, స్వాగతం యివ్వనందున బయటనే నిలబడి పోయినాడు. గాలిబ్ ఆలస్యం చేసినందుకు ఆ కార్యదర్శి విసుక్కొని, కారణం తెలుసుకు రమ్మని జమాదార్‌ని పంపాడు. జమాదార్ ద్వారా గాలిబ్ పంపిన సమాధానం, "మా ఆచారం ప్రకారం మీరు వచ్చి నాకు స్వాగతం చెప్పని కారణంగా మీ గదిలోకి రాలేకపోయినాను."

థామ్సన్ బయటకు వచ్చాడు. "మీకు నేను ఉద్యోగం యివ్వదలచి పిలిపించాను. రాజలాంఛనాలు జరపడానికి, స్వాగతాలు పలకడానికి ఇది దర్బార్ కాదు" అన్నాడు.

దానికి గాలిబ్ యిచ్చిన సమాధానం, "ప్రభుత్వ ఉద్యోగం నా కున్న గౌరవాన్ని పెంచగలగాలి గాని, పోగొట్టకూడదు" అంటూ పల్లకీ ఎక్కి వెళ్ళిపోయినాడు.

మంచి ఉద్యోగం రానున్నది చేజేతులా వదలుకుని, జీవితాంతం దరిద్రంలో కాలం గడిపి, అద్భుతమైన కవితలను వ్రాసిన మహాకవి మీర్జా గాలిబ్. ఈయన శత జయంత్యుత్సవాలు ఈ సంవత్సరం జరుగుతున్నాయి.

## కుక్కకు అంకితం

రామ్‌గణేశ్ గడ్కరీ అనే మరాటీ రచయిత తన నాటకం ఒకదాన్ని కుక్కకు అంకితంచేశాడు. ఆయన కృతిని స్వీకరించడానికి ఆ కుక్క లేదు. అది చనిపోయి చాలకాలమైంది.

పశ్చిమ తీరాన ఉన్న సహ్యాద్రి పర్వతాలలో రాయగఢ్ అనే కోట ఉన్నది. ఈ కోటలో రెండు సమాధులు ఈనాటికీ ఉన్నాయి. వాటిని మూడువందల సంవత్సరాలుగా ప్రజలు ఆరాధిస్తున్నారు. అందులో ఒకటి రాజుగారి సమాధి; రెండవది ఒక కుక్కది.

ఆ రాజు పేరు శివాజీ. కుక్క శివాజీ ప్రాణమిత్రుడు. ఛత్రపతి శివాజీ అంతఃపురంలో ఉన్నా, అడవుల్లో ఉన్నా, సభామందిరంలో ఉన్నా యుద్ధభూమిలో ఉన్నా, ఆ కుక్క ఆయన వెంటనే ఉండేది. రాత్రింబవళ్ళు శివాజీని కంటికి రెప్పలా కాపాడుతూ ఉండేది. దానికి మరొక వ్యాపకం ఉండేదికాదు.

శివాజీ చనిపోయాడు. రాయగర్ కోటలో వేలాది సైనికులు, ప్రజలు ఆయనకు అంజలి ఘటించారు. శివాజీ భౌతిక కాయం అగ్నిలో భస్మమైపోతూ ఉండగా ఒక విడ్డూరం జరిగింది. వేలాది మంది తలలు వంచి, కన్నీరు కార్చుతున్న సమయంలో ఆ కుక్క కణకణ మండే చితిలోకి పరుగుతీసి శివాజీని చేరుకున్నది. ఛత్రపతి శివాజీకి, కుక్కకు ప్రజలు ప్రక్క ప్రక్కనే సమాధులు ఏర్పాటుచేశారు.

—వి. ఎస్. సుక్తాంకర్

## సింగపూర్

భారత—చైనాదేశాలకు మధ్యగా, మలయా సరిహద్దున 225 చదరపుమైళ్ల విస్తీర్ణం గల సర్వసత్తాక నగరం సింగపూర్. భౌగోళికంగాను, విద్యా, సాంస్కృతిక విషయకంగాను, కార్మిక, వాణిజ్యవిశేషాలవల్ల ఈ నగరం ప్రసిద్ధమైంది. ఇంత విభిన్నత గల దీవి మరొకటి లేదని జాన్ గంథర్ అన్నారు.

వేయి సంవత్సరాలకు పూర్వం ఇది సముద్రతీరపట్టణం మాత్రమే. జనాభాకూడా బహు స్వల్పం. 11 వ శతాబ్దంలో శ్రీ విజయరాజ వంశానికి చెందిన ఒక జావా రాకుమారుడు ఈ దీవికి వచ్చాడు. సముద్రతీరంలో సింహంవంటి జంతువును చూచాడు. సంస్కృతాభిమాని కావడం వల్ల దానిని సింహపురం అన్నాడు. అదే సింగపూర్ అయింది.

క్రమంగా సింగపూర్ ప్రాబల్యం పెరుగుతూ వచ్చింది. యుద్ధాల కారణంగా వ్యాపారం దెబ్బ తిన్నది. మలయా సముద్రంపైకి వెళ్లే ఓడ దొంగలకు ఇది రహస్యస్థావరం అయింది. దీని కీలకాన్ని గుర్తించినవాడు సర్ స్టాన్‌ఫర్డ్ రాఫిల్స్. ఇతను నాటి ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందినవాడు. 1819 జనవరిన కొద్దిపాటి బలంతో వెళ్ళి ఆ దీవిని ఆక్రమించుకున్నాడు. రెండు శతాబ్దాల ముందుచూపు గల రాఫిల్స్ సింగపూర్‌ను స్వేచ్ఛానగరంగా ప్రకటించాడు. అక్కడ వాణిజ్యంపై పన్ను లేకుండాచేసి, అన్ని దేశాలవారు స్వేచ్ఛగా రాకపోకలు సాగించడానికి వీల్లు కలిగించాడు. 1819 లో నాలుగు వేల జనాభా మాత్రమే గల సింగపూర్ జనాభా

---

తిరుగుతూ మెరుస్తూన్న ఒక రక్తపు చారిక గడ్డకడుతూ నల్లబడుతూంటే రవణయ్య గుండెల్లో తెవ్వుమన్నట్లయి, కెవ్వుమని అరవబోయి ఆటు చూశాడు.

రోడ్డుకి కుడివక్కగా తీసి ఆపుచేసి ఉంచిన బరువైన బియ్యపు బస్తాల లారీ.

ఎడంప్రక్కగా గుడ్డివాడు కూర్చునే స్థలంలో భయంకరమైన శూన్యం.

కలవరపడుతూ రవణయ్య కంగారుగా లారీ నీడలోకి వెళ్ళాడు. ఇద్దరు కాకీబట్టల ఆసాములతో తన సర్వీసులో చూసిన ఏక్సిడెంట్లని గురించి ఉత్సాహంగా చెబుతూన్న కానిస్టేబుల్ కనిపించాడు. "ఏమయింది? . . . ఇక్కడ గుడ్డివాడు ఉండాలి. ఏడీ?" అంటూ అడిగాడు రవణయ్య గాభరాగా.

మంచి రసపట్టులో ఉన్న కథకి అడ్డువచ్చిన రవణయ్య మీద విసుక్కుంటూ "ఏం? వాడు నీకు చుట్టమా? . . . డబ్బు పోయే డబ్బుపోయే అని నెత్తి నోరూ మొత్తుకుంటూ అర్ధరాత్రికి అర్ధరాత్రి అర్జంటుగా మొలకొలుకులు బియ్యాన్ని మద్రాసు చేరెయ్యవలసిన ఈ లారీ కిందకి వచ్చి వాడిని ఎవడు పడమన్నాడు? వాడి చావు కాదు కాని ఈ చలిలో రోడ్డు పక్కని మా చావు కొచ్చింది! ఫో. జనరల్ హాస్పిటల్‌కి ఫో! ఇప్పుడిక తీసుకుపోయారు వాడిని పోస్టుమార్టమ్‌కి" అంటూ అటు తిరిగి, ఆ ఆసామీల దగ్గిరనించి బీడీ ఓటి పుచ్చుకుని వెలిగిస్తూ "ఆ. . . ఎంతవరకూ చెప్పానూ?" అన్నాడు కానిస్టేబుల్.

"ఆఁ!" అని ఒక్క గావుకేకపెట్టి వీరనంగా పరుగు తీశాడు రవణయ్య హాస్పిటల్ కేసి.

హాస్పిటల్ అధికారులకి "శవం ముట్టింద"ని రసీదు రాసి ఇస్తూంటే రవణయ్యకి గుండెల్లోంచి పెల్లుబికి వచ్చింది దుఃఖం.

అప్పుడు బావురుమని ఏడ్చిన రవణయ్యే, "చందావేసి ఆ ముష్టివాడికి దహనం ఏర్పాట్లు చేయిస్తున్నావు. నీకే విటి సంబంధం?" అన్న ఆచారి మాటలకి, "వాడు క్లోజింగూ నేను ఓపెనింగూ రా. మేం ఇద్దరం డబుల్ జీరో!" అంటూ భయంకరంగా ఓ వెర్రి నవ్వు నవ్వాడు. గుడ్డివాడి శవం కాలుతూంటే మళ్లీ అలాంటి నవ్వే నవ్వి, తన జేబులో అప్పటిదాకా అతి పదిలంగా దాచుకొన్న బ్రాకెట్ కాగితపు రీలు తీసి ఆ మంటల్లో విసిరి, సున్నాలు సున్నాలుగా పైకి పోతూన్న పొగని చూసి "డబుల్ జీరో" అని ఓ వికటాట్టహాసం చేశాడు రవణయ్య. ఇవాళ్టికి కూడా ఏ అర్ధరాత్రి వేళో ఉన్నట్టుండి శ్మశానాల్లోంచి గుండె లవిసేలా "డబుల్ జీరో" అన్న కేక ఓటి వినిపిస్తూనే ఉంటుంది ఆ ఊళ్లోవాళ్లకి! ★